సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



వర్షంతో రైతుల ఆందోళన

జిల్లాలోని పలుచోట్ల గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



స్వగ్రామాలకు తిరుగుపయనం

ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వలస కూలీలు ఇక్కడ మిర్చి కోతలు పూర్తి కావడంతో తిరిగి స్వగ్రామాలకు పయనమవుతున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా ధ్వజపట లేఖనం

నేడు రామాలయంలో ధ్వజారోహణం



జీయర్ మఠంలో పూజ చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న వసంత ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుడాధివాసం, ధ్వజపట లేఖనం కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ప్రధాన సంకేతమైన గరుత్మంతుడి బొమ్మను జీయర్ మఠంలో ఆలయ అర్చకులు వస్త్రంపై లిఖించారు. ప్రత్యేక పూజల అనంతరం గరుత్మంతుడి చిత్రపటానికి హారతి సమర్పించారు. ఈ సందర్భంగా దేవనాథ జీయర్ స్వామి భక్తులకు ప్రవచనం అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, చతుఃస్థానార్చన జరపనున్నారు. ఈ సందర్భంగా సంతాన ప్రాప్తి కోసం మహిళలకు గరుడ ప్రసాదాన్ని అర్చకులు అందజేస్తారు. పూజల్లో ఆలయ ప్రధానార్చకులు విజయరాఘవన్, స్థానాచార్యులు స్థలశాయి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవీ వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం నాదనీరాజనం, సూక్తి పారాయణం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీచక్రార్చన, లక్ష కుసుమార్చన, శ్రీలలితా సహస్ర నామ హవనం తదితర కార్యక్రమాలు చేశారు. ఆ తర్వాత అమ్మవారికి నివేదన సమర్పించి హారతి ఇచ్చాక అర్చకులు మంత్రపుష్పం పఠించారు.

రామయ్యను దర్శించుకున్న కేరళ ఐఏఎస్ అధికారి



రామాలయంలో సాయికృష్ణ తదితరులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కేరళకు చెందిన ఐఏఎస్ అధికారి సాయికృష్ణ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వాగతం పలకగా, ఆలయ అధికారులు స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రావణ్‌కుమార్, పీఆర్‌ఓ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో నేడు తుమ్మల పర్యటన

భద్రాచలం: రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం భద్రాచలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ రూట్ మ్యాప్‌ను గురువారం విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు సుభాష్‌నగర్‌లో నిర్మాణం చేపడుతున్న కరకట్ట పనులను పర్యవేక్షిస్తారని, 10:30 గంటలకు మిథిలా స్టేడియంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం, పట్టాభిషేకం ఏర్పాట్లు పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రేపటి వరకు తేలికపాటి వర్షాలు



సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఈనెల 5వ తేదీ వరకు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.నారాయణమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు కోసి ఆరబెడుతున్న పంట ఉత్పత్తులపై టార్పాలిన్లు కప్పుకోవాలని, కోత దశలో ఉన్న పంటలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మన పట్టిసీమ.. మోతెగడ్డ!

లక్ష్మణ సమేత సీతారాములను దర్శించుకునేందుకు నిత్యం వేల సంఖ్యలో భక్తులు భద్రాచలం వస్తుంటారు. దీంతో పాటు ఏపీలోని పాపికొండలు, మారేడుమిల్లి, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు వెళ్లే భక్తులూ భద్రాచలం మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. భద్రాచలం వచ్చే భక్తులు, పర్యాటకులు మాత్రం కేవలం రామచంద్రస్వామిని దర్శనం చేసుకుని తిరిగి స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. ఇలా వచ్చే భక్తులు మరింత సమయం భద్రాచలంలో గడిపేందుకు వీలుగా టూరిజం ప్యాకేజీలు, ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శనకు ఏర్పాట్లు లేకపోవడం వెలితిగా మారింది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం





భద్రాచలం నుంచి బోటింగ్ ఏర్పాటు చేస్తే భేష్..

- గోదావరి మధ్యలో చూడచక్కని వీరభద్రుడి ఆలయం
- టెంపుల్ టూరిజంతో భద్రాద్రి అభివృద్ధికీ అవకాశాలు
- ముక్కోటి 'ఏరు'తో మారిన భద్రగిరి ఇమేజ్

ముక్కోటితో మారిన ఇమేజ్..

భద్రగిరిలో భక్తులు ఎక్కువ సమయం గడిపేందుకు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రయత్నించారు. గత జనవరిలో 'ఏరు' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. గోదావరి తీరంలో టెంట్ టౌన్ ఏర్పాటు చేశారు. ట్రైబల్ మ్యూజియంలో గిరిజన పల్లెను సృష్టించారు. అక్కడే మినీ బోటింగ్, బాక్స్ క్రికెట్‌లను సైతం అందుబాటులోకి తెచ్చే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తెప్పోత్సవం రోజున గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సూపర్ సక్సెస్ అయ్యాయి. తెప్పోత్సవం ముగిసిన తర్వాత భక్తులు ఇళ్లకు వెళ్లిపోవాలంటూ అధికారులు పదే పదే మైకుల్లో అనౌన్స్ చేయాల్సి వచ్చింది.

అచ్చంగా పట్టిసీమ..

పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టిసీమ ప్రకృతి అందాలకు నెలవు. గోదావరి నది మధ్యలో ఉన్న చిన్న గుట్టపై ఉన్న శివాలయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి. ఈ ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు రావడమే కాదు.. అనేక సినిమాలు ఇక్కడ చిత్రీకరణ జరుపుకున్నాయి. 80వ దశకంలోని జానకిరాముడు, స్వాతిముత్యం తదితర సూపర్‌హిట్ సినిమాల్లో ఈ ఆలయం కనిపిస్తుంది. అచ్చంగా పట్టిసీమ తరహాలోనే బూర్గంపాడు మండలం సారపాక నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మోతె గ్రామం దగ్గర గోదావరి నది మధ్యలో మోతెగడ్డ ద్వీపం ఉంది. నీళ్లు, ఇసుక మేటలు, రాళ్ల దిబ్బలు చుట్టుముట్టిన ఈ గుట్టపై భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయం ఉంది. కాకతీయుల కాలంలో ఈ ఆలయం నిర్మించినట్టుగా చెబుతారు. శివరాత్రి సందర్భంగా ఇక్కడ జరిగే జాతరకు వేలాదిగా భక్తులు వస్తారు. ఆ తర్వాత అంతా గప్‌చుప్. భద్రాచలం సమీపంలోనే ఈ ఆలయం ఉన్నప్పటికీ ఇప్పటికీ రావాల్సినంత ప్రాచుర్యం మోతెగడ్డ వీరభద్రుడికి దక్కలేదు.

బోటింగ్ సౌకర్యం కల్పిస్తే..

టూరిజం శాఖ ఆధ్వర్యంలో భద్రాచలంలోని పుష్కరఘాట్ స్నానఘట్టాల నుంచి మోతెగడ్డ వరకు బోటింగ్ సౌకర్యం కల్పిస్తే ఇటు భక్తులు, అటు పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. గతేడాది కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం మోతెగడ్డ దగ్గర ఎలాంటి అభివృద్ధి పనులు చేయొచ్చనే అంశాలను పరిశీలించింది. టెంపుల్ టూరిజంలో భాగంగా భద్రాచలానికి అనుబంధంగా మోతెను అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

సంపద పెంచే పరిశ్రమలు స్థాపించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వ్యవసాయ భూముల్లో ఫామ్‌పాండ్‌ల నిర్మాణంతో రైతులు ఆర్థికాభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సంపద పెరిగే పరిశ్రమలు స్థాపించేలా రైతులు, యువతను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు తమ భూముల్లో ఫాంపాండ్‌ల నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో వ్యవసాయ భూముల్లో సుమారు 52వేల బోర్లు ఉన్నాయని, కనీసం 50వేల ఫామ్ పాండ్‌లు ఉండాలని అన్నారు. తద్వారా చేపలు, అజొల్లా పెంపకం వంటి వాటి ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని చెప్పారు. ఉపాధిహామీ కూలీలందరికీ జీవనజ్యోతి, జీవన సురక్ష పథకంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, హౌసింగ్ పీడీ శంకర్, డీపీఓ చంద్రమౌళి, మిషన్ భగీరథ ఈఈలు నళిని, తిరుమలేష్, ఎస్సీ సంక్షేమాధికారి అనసూయ, బీసీ సంక్షేమాధికారి ఇందిర పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య జీవితం ఆదర్శం..

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య చూపిన స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన దొడ్డి కొమరయ్య జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రైతాగ సాయుధ పోరాటంలో మొదట గుర్తుకొచ్చే వ్యక్తి దొడ్డి కొమరయ్య అని అన్నారు. 1927లో ఉమ్మడి వరంగల్ జిల్లా కడివెండిలో జన్మించిన ఆయన మహోన్నత ఉద్యమానికి ఆద్యుడవడం తెలంగాణ ప్రజలకు గర్వకారణం అన్నారు. అంతకుముందు కొమరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, బీసీ సంక్షేమాధికారి ఇందిర, కలెక్టరేట్ ఏఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



కొమరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ పాటిల్, అదనపు కలెక్టర్ తదితరులు

అధునాతన హంగులతో రీడింగ్ రూమ్‌లు

ఐటీడీఏ పీఓ రాహుల్



రీడింగ్ రూమ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఓ

భద్రాచలంటౌన్: నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా అధునాతన హంగులతో రీడింగ్ రూమ్స్‌ను నిర్మిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ వెల్లడించారు. భద్రాచలం తాత గుడి సెంటర్‌లోని గ్రంథాలయాన్ని గురువారం సాయంత్రం సందర్శించిన ఆయన రీడింగ్ రూమ్స్ నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. గ్రంథాలయంలో నిరుద్యోగులకు కావాల్సిన పుస్తకాలు లేక ఇబ్బంది పడుతున్నట్లు తమకు తెలిసిందన్నారు. దీంతో వంద మంది ఒకేసారి చదువుకునేలా హాల్ నిర్మిస్తున్నామని, తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం కల్పించడమే కాక టేబుళ్లు, కుర్చీలు సమకూరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్, డి.హరీష్, టీఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'యువ వికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

గిరిజన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఓ రాహుల్ సూచించారు. గిరిజన నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత కార్యాలయాల్లో ఈనెల 14వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు.

గోదావరిని పరిశీలించిన సీడబ్ల్యూసీ బృందం



బ్రిడ్జి పై నుంచి సర్వే చేస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద గోదావరిని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) సభ్యులు గురువారం సందర్శించారు. ఉత్తరాఖండ్‌లోని రూర్కీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీకి చెందిన డాక్టర్ రవీంద్ర విఠల్ కాలే, ప్రొఫెసర్ ముత్తయ్య పెరుమాళ్ భద్రాచలం కేంద్ర జల సంఘం కార్యాలయ సబ్ డివిజన్ ఇంజనీర్ కె.పృథ్వీరాజ్ నేతృత్వంలో పరిశీలించారు. నూతన బ్రిడ్జిపై 'ఎంట్రోపీ ఇమేజ్ ప్రాసెసింగ్ బేస్డ్ నాన్ కాంటాక్ట్ డిశ్చార్జ్ మానిటరింగ్ టెక్నిక్' అనే యంత్రాన్ని అమర్చేందుకు అనుకూలమైన వాతావరణం ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో నది ఉపరితల ప్రవాహ వేగాన్ని విశ్లేషించి కచ్చితమైన సమాచారం వస్తుంది. వర్షాకాలం వరదల సమయంలో ఈ వ్యవస్థ పూర్తి స్థాయిలో ఉపయోగపడనుందని, రానున్న 24 గంటల్లో ఎగువ నుంచి ఎంత వరద వస్తుందో అంచనా వేయవచ్చని తెలిపారు. భద్రాచలంలో ప్రతీ నిమిషానికి పెరుగుతున్న నీటి వేగాన్ని అంచనా వేసి హెచ్చరిక స్థాయి వరద ఎన్ని గంటలకు వస్తుందో గుర్తించవచ్చని, తద్వారా లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయొచ్చని వివరించారు.

ఆకట్టుకుంటున్న గిరిజన పల్లె



ఐటీడీఏ ప్రాంగణంలో నిర్మించిన గిరిజన మ్యూజియం

భద్రాచలంటౌన్ : భద్రాచలం ఐటీడీఏ ఆవరణలో నిర్మించిన గిరిజన మ్యూజియం అందరినీ ఆకట్టుకుంటోంది. హంగూ ఆర్భాటాలకు దూరంగా పూర్తిగా ఆదివాసీల పల్లె జీవితం సాక్షాత్కరించేలా నిర్మించిన ఈ మ్యూజియాన్ని ఈనెల 6న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. పిల్లల కోసం ప్రత్యేకంగా బోటింగ్, ప్లే ఏరియా, యువకుల కోసం బాక్స్ క్రికెట్, శాండ్ వాలీబాల్, ఆర్చరీ గేమ్, ఓపెన్ జిమ్‌లు ఇక్కడ నిర్మించారు. ఆదివాసీ రుచుల నుంచి చైనీస్ వంటకాలతో కూడిన ఫుడ్ కోర్టు రెడీ చేశారు. మరోవైపు మ్యూజియాన్ని గిరిజనుల పండుగలు, వేటలో ఉపయోగించే ఆయుధాలు, ఇళ్లలో వినియోగించే పనిముట్లు, కళాకృతులు, వాయిద్యాల థీమ్‌లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వెరసి మూడు నెలల కాలంలోనే గిరిజన మ్యూజియం 'మినీ స్టూడియో'గా మారిపోయింది. దీంతో ప్రారంభానికి ముందే ప్రీ వెడ్డింగ్ షూట్ కోసం కాబోయే వధూవరులు, బర్త్‌డే పార్టీల కోసం గ్రూపులు గ్రూపులుగా స్థానికులు ఇక్కడికి రావడం మొదలైంది.

పెదవాగును సందర్శించిన ఏపీ అధికారులు



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్ద గల పెదవాగు ప్రాజెక్టును గురువారం ఏపీ నీటి పారుదల శాఖ అధికారులు సందర్శించారు. గతేడాది జూలై 18న కురిసిన భారీ వర్షాలు, వరదలతో ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు గండ్లు పడిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు తెలంగాణ, ఏపీ ఉమ్మడి పరిధిలో ఉండడంతో ఏపీ నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించి ఆయకట్టు రైతులతో మాట్లాడారు. ప్రాజెక్టు మరమ్మతుల కోసం ఏపీ వాటా నిధుల కేటాయింపు, మరమ్మతులు పూర్తి చేస్తే ఏపీలోని ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం తదితర అంశాలపై చర్చించారు. ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే గోదావరి రివర్ బోర్డు సమావేశానికి హాజరై, తెలంగాణ నీటి పారుదల శాఖ అధికారులతో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు నీటిపారుదల శాఖ ఎస్‌ఈ నాగార్జునరావు, నీరు–ప్రగతి పథకం ఎస్‌ఈ వెంకటస్వామి, స్థానిక ఐబీ డీఈఈ కృష్ణ, ఏఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'నవమి'కి అన్ని శాఖలూ సన్నద్ధం

- ఏపీ, తెలంగాణ నుంచి భద్రాచలానికి 300 బస్సులు..
- 16 ప్రథమ చికిత్స కేంద్రాలు, 52 మంది వైద్యులు, 178 మంది సిబ్బంది విధులు
- 66 మందితో అగ్నిమాపక శాఖ, 15 మందితో సింగరేణి రెస్క్యూ టీమ్
- ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన టూరిజం శాఖ



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తున్న విద్యుత్ సిబ్బంది



భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఈనెల 6,7 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకలకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి కల్యాణం, పట్టాభిషేకం ఉత్సవాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. దీంతో ఖమ్మం ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఏడు డిపోల నుంచి ఈనెల 5, 6, 7 తేదీల్లో 200 బస్సులు ఏర్పాటు చేశామని, వీటికి అదనంగా ఏపీ నుంచి మరో 100 బస్సులు రానున్నాయని భద్రాచలం ఆర్టీసీ డీఎం తిరుపతి తెలిపారు. ఇంకా భద్రాచలం నుంచి కూకట్‌పల్లికి రెండు, మియాపూర్‌కు రెండు సర్వీసులు నడిపిస్తున్నట్లు చెప్పారు. భద్రాచలం బస్టాండ్‌లో 6వ తేదీన రెడ్డిసత్రం వారి సౌజన్యంతో రెండు వేల మంది భక్తులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నామని, ఐటీసీ సహకారంతో మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు అందజేస్తున్నామని వివరించారు. ఇప్పటికే బస్టాండ్‌లో ఒక చలివేంద్రం ఏర్పాటు చేశామని, మరికొన్ని కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మూడు రోజులు వైద్య సేవలు..

శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఏమైనా అనారోగ్య సమస్య ఎదురైతే వైద్య సేవలు అందించేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ సన్నద్ధమైంది. గతంలో భద్రాచలంలో ఎనిమిది, పర్ణశాలలో రెండు ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈ ఏడాది వాటిని 16కు పెంచారు. తొలిసారి సారపాకలో సైతం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య తెలిపారు. కల్యాణాన్ని వీక్షించే ప్రతి సెక్టార్‌లో ఒక వైద్యుడితో పాటు నలుగురు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని, ఇలా మొత్తం 52 మంది వైద్యులు, 178 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. అత్యవసర సేవల కోసం 50వేల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేయగా, భక్తుల కోసం 50 బెడ్లతో ప్రత్యేక వార్డు, పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఐదు బెడ్ల చొప్పున అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఇక వేడుకల సందర్భంగా విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక ఏఎస్పీ, 15 మంది డీఎస్పీలు, 59 మంది సీఐలు, 188 మంది ఎస్సైలతో సహా మొత్తం 2వేల మంది సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. భద్రాద్రితో పాటు ఖమ్మం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచి పోలీసులు రానున్నారు.

అగ్నిప్రమాదం జరిగితే..

శ్రీరామనవమి సందర్భంగా ఇల్లెందు, అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం అగ్నిమాపక కేంద్రాల నుంచి మొత్తం 66 మంది విధుల్లో పాల్గొంటారు. వీరికి అదనంగా సింగరేణి నుంచి 15 మంది రెస్క్యూ సిబ్బందితో పాటు రెస్క్యూ ఫైర్ ఇంజిన్, కేటీపీఎస్, హెవీవాటర్ ప్లాంట్ల నుంచి ఆరు వాటర్ టెండరింగ్ ఫైర్ ఇంజన్లు, 2 ఫైర్ బుల్లెట్ బైక్‌లు, 70 అగ్నిమాపక యంత్రాలను (సిలిండర్లు) సిద్ధం చేసినట్లు భద్రాచలం అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

రూ.10 లక్షలతో విద్యుత్ మరమ్మతులు..

ఈనెల 6, 7 తేదీల్లో భద్రాచలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఆ శాఖ ఎస్‌ఈ మహేందర్ ఆదేశాల మేరకు భద్రాచలం డీఈ జీవన్ కుమార్ రూ.10లక్షల వ్యయంతో అవసరమైన మరమ్మతులు చేపట్టారు. మిథిలా స్టేడియం వద్ద గత పదేళ్లగా 250 కేవీ జనరేటర్ మాత్రమే ఉండేది. ఈ ఏడాది 500 కేవీ జనరేటర్‌ను అధికారులు అందుబాటులో ఉంచారు. శ్రీరామనవమి వేడుకలకు భద్రాచలంలో 70 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్న పంచాయతీ..

రామయ్య కల్యాణానికి భక్తులు భారీగా రానుండగా పట్టణంలో పారిశుద్ధ్య సమస్య సహజం. ఈ క్రమంలో బ్రహ్మోత్సవాలకు జిల్లాలోని 19 మంది ఎంపీఓలు, 75 మంది పంచాయతీ కార్యదర్శులు విధులకు రానున్నారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి పర్యవేక్షణలో డీఎల్‌పీఓ సుధీర్ ఆధ్వర్యంలో 300 మంది సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు చేపట్టనున్నారు. భక్తుల సౌకర్యార్థం 140 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలో 28 చోట్ల తాగునీటి కేంద్రాలు. బ్రిడ్జి వద్ద లైటింగ్, బ్లీచింగ్, ఫినాయల్, యాసిడ్ స్ప్రే తదితర సేవలు అందించనున్నారు. ఇందుకు గాను గ్రామ పంచాయతీ అధికారులు రూ.35 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. ఇక టూరిజం శాఖ ఆధ్వర్యంలో రూ. కోటి వ్యయంతో భద్రాచలం, పర్ణశాలలో 120 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కొత్తగూడెంటౌన్: పారా లీగల్ వలంటీర్లు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. గురువారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని హాల్‌లో పారా లీగల్ వలంటీర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సమాజంలో పారా లీగల్ వలంటీర్ల బాధ్యత కీలకమైందని అన్నారు. పారా లీగల్ వలంటీర్లు బి.బిక్షమయ్య, ఎం.జానకిరామ్‌లు పాల్వంచలోని ఆగాపే స్కూల్‌లో మనో న్యాయ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

క్లుప్తంగా

దార్శనికుడు మాజీ ప్రధాని వాజ్‌పేయి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

చుంచుపల్లి: దేశ అభివృద్ధిలో నవశకానికి నాంది పలికిన దార్శనిక నేత మాజీ ప్రధాని వాజ్‌పేయి అని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో వారు మాట్లాడారు. రాజకీయాల్లో ప్రజాస్వామ్యం, విలువల ఆధారిత రాజకీయాలను బలోపేతం చేయడానికి ఆయన కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోలి మధుసూదన్ రెడ్డి, ఉపేందర్ సింగ్, లక్ష్మి, ఎల్లంకి మురళీమోహన్, సుబ్బారావు, పైడిపాటి రవీందర్, జీవికే మనోహర్, కుంజా ధర్మరావు, డాక్టర్ విజయ లక్ష్మి, సీతారామరాజు, బాలరాజు, ఎడ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు విరివిగా తలంబ్రాల సమర్పణ



తలంబ్రాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి కల్యాణ మహోత్సవంలో వినియోగించే తలంబ్రాలను రెండు రాష్ట్రాలకు చెందిన భక్తులు విరివిగా సమర్పిస్తున్నారు. పండించిన ధాన్యాన్ని గోటితో వలిచి రామయ్యకు అందించేందుకు రోజూ భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన శ్రీరామ కోటి భక్త సమాజం ఆధ్వర్యంలో కోటి గోటి తలంబ్రాలను తెచ్చి ఆలయంలో అందించారు. రాజమండ్రికి చెందిన రామ భక్తులు కూడా కోటి గోటి తలంబ్రాలను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రవణ్ కుమార్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది మురళీ కృష్ణమాచార్యులు, శ్రీరామానుజ శ్రీనివాసాచార్యులు, భక్తుడు రామకోటి రామరాజు పాల్గొన్నారు.

సరైన పత్రాలు చూపి వాహనాలు తీసుకెళ్లండి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న 116 ద్విచక్ర వాహనాలు, 10 ఇతర వాహనాలు హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్లలో ఉంచినట్లు జిల్లా పోలీస్ మోటార్ వాహనాల అధికారి ఓ.సుధాకరరావు తెలిపారు. సరైన పత్రాలు చూపి వారి వాహనాలను శుక్రవారం నుంచి 6 నెలలలోపు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. పత్రాలను సంబంధిత పోలీస్ స్టేషన్లలో సమర్పించి, అక్కడి నుంచి రుజువు పత్రాన్ని తీసుకుని, మోటారు వాహనాల అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అన్‌క్లెయిమ్డ్ వాహనాల జాబితా జిల్లా పోలీస్ సోషల్ మీడియా ఖాతాల్లో ఉంచినట్లు పేర్కొన్నారు.

రామాలయంలో మాక్ డ్రిల్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో గురువారం భద్రాచలం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాద సమయంలో అందుబాటులో ఉన్న సిబ్బంది స్పందించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, దేవస్థానం ఎస్పీఎఫ్, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

తాలిపేరు ప్రాజెక్ట్‌కు మరమ్మతులు..

ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ



తాలిపేరు ప్రధాన కాలువను పరిశీలిస్తున్న ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్‌కు, కాలవలకు మరమ్మతులు చేపట్టాలని ప్రాజెక్టు ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ అధికారులకు సూచించారు. గురువారం ఆయన తాలిపేరుతోపాటు ప్రధాన కాలువను పరిశీలించారు. రెండో జోన్‌లో రైతులు సాగు చేసిన పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత రబీలో రెండో జోన్‌కు సాగునీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. సాగు చివరి దశకు చేరిందని, ఈ నెల 10 తర్వాత సాగునీటి విడుదలను నిలిపివేసి మరమ్మతులు చేపట్టాలన్నారు. కాలువపై అండర్ టన్నెల్ నిర్మాణ పనులను చేపట్టి వర్షాకాలం ఆరంభమయ్యేలోపు పూర్తి చేయాలని డీఈ తిరుపతిని ఆదేశించారు. ఏఈలు ఉపేందర్, సంపత్, సిబ్బంది ఉన్నారు.

స్వగ్రామాలకు తిరుగుపయనం



కాలినడకన తిరిగి వెళ్తున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలు

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ పల్లెల్లో సందడి నెలకొంది. వృద్ధులను, చంటి పిల్లలను ఇళ్ల వద్ద విడిచిపెట్టి పలువురు అడవి బిడ్డలు బతుకుదెరువు కోసం తెలంగాణ, ఆంధ్రాలోని గ్రామాలకు వలస వచ్చారు. ఇక్కడి మిర్చి కోతలు పూర్తి కావడం, విప్ప పూలు రాలే సీజన్ కావడంతో తిరిగి స్వగ్రామాలకు వెళ్తున్నారు. దీంతో ఛత్తీస్‌గఢ్‌లోని ఆదివాసీ గూడేల వైపు వెళ్లే రహదారులు కళకళలాడుతున్నాయి. – చర్ల

- మూడు, నాలుగు నెలలుగా తెలంగాణ, ఏపీ సరిహద్దు గ్రామాల్లో పనులు
- మిర్చి కోతలు చివరి దశకు చేరడంతో తిరిగి వెళ్తున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలు
- విప్ప పూలు రాలే సీజన్ కావడంతో వడివడిగా గూడేల వైపు అడుగులు

డిసెంబర్, జనవరిలలో వచ్చి..

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లోని అటవీ ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు స్వగ్రామాల్లో పనుల్లేక డిసెంబర్, జనవరి నెలల్లో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు మిర్చి కోతల కోసం తరలివచ్చారు. తోటలకు సమీపంలోని వాగులు, నదులు, చెరువుల ఒడ్డునే తాత్కాలికి నివాసాలను ఏర్పాటు చేసుకుని మూడు, నాలుగు నెలలపాటు పనులు సాగించారు. రోజుకు రూ. 300 మేర కూలి చేసుకుంటూ ఒక్కొక్కరు రూ. 20 వేల నుంచి రూ. 22 వేల మేర సంపాదించుకున్నారు.

విప్ప పూలు రాలుతుండటంతో..

మిర్చి కోత పనులు చివరి దశకు చేరాయి. మరోవైపు ప్రకృతి సహజసిద్ధంగా లభ్యమయ్యే పంట విప్పపూలు రాలుతున్నాయి. దీంతో వాటిని ఏరుకుని విక్రయించునేందుకు ఆదివాసీలు తమ గ్రామాలకు తరలివెళ్తున్నారు. రైతులు ఏర్పాటు చేసిన వాహనాల్లో గూడేలకు తరలిపోతుండగా అటవీ ప్రాంత రహదారులు సందడిగా మారాయి.



మిర్చి కోతలు పూర్తి కావడంతో స్వగ్రామానికి వెళ్తున్న ఆదివాసీలు

దగ్గర గ్రామాలవారు కాలినడకనే వెళ్తున్నారు. బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని ఆదివాసీ గ్రామాలకు వెళ్లే కుర్నపల్లి, తిప్పాపురం, పూసుగుప్ప రహదారులు వాహనాలతో రద్దీగా మారాయి. వారం రోజుల నుంచి ఆదివాసీలు తిరిగి పయనమవుతున్నారు.

సరుకులు ఇక్కడి నుంచే..

ఛత్తీస్‌గఢ్‌లోని ఆదివాసీ గ్రామాల్లో నిత్యావసర సరుకుల కొనుగోలుకు సరైన దుకాణాలు ఉండవు. ఈ నేపథ్యంలో తిరుగు ప్రయాణంలోనే ఆదివాసీలు వర్షాకాలం మొత్తానికి సరిపడా సరుకులను కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. దీంతో చర్లలోని దుకాణాలు కొనుగోళ్లతో కళకళలాడుతున్నాయి. గత ఆదివారం కూడా చర్లలో జరిగిన వారపు సంతలో బియ్యం, నూకలు ఇతర నిత్యావసరాల విక్రయాలు పెద్ద ఎత్తున సాగాయి. ఆదివాసీ యువకులు మొబైల్ ఫోన్లు, రేడియోలు, వాచ్‌లు కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపుతున్నారు. మిర్చి కోత పనులకు వలస వచ్చిన ఆదివాసీలు తిరిగి ఇళ్లకు చేరుకుంటుండటంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.



పనులు పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకున్న సుకుమా జిల్లా దోకుపాడు ఆదివాసీలు

పోషణ కోసం పోరాటం



ప్రతీ సంవత్సరం మిర్చి కోతల సీజన్‌లో పనుల కోసం వస్తాం. పొట్టపోషణ కోసం మూడు, నాలుగు నెలల పాటు పిల్లల్ని, తల్లిదండ్రులను వదిలి వస్తాం. ఇక్కడ పని చేసి వచ్చిన డబ్బులతో వర్షాకాలానికి సరిపడా సరుకులన్నీ కొనుక్కొని వెళ్తాం.

–పొడియం సింగ, దోకుపాడు

పనుల్లేక ఇక్కడికి వచ్చాం



మా దగ్గర పనులు ఏమీ ఉండక పోవడం వల్ల పొరుగున ఉన్న ప్రాంతాలకు కూలి పనులకు పోతాం. ఏటా ఇదే మా జీవన విధానం. పనులు పూర్తవ్వడంతో ఇళ్లకు చేరి పిల్లలు, పెద్దలతో సంతోషంగా గడుపుతాం.

–కుంజం దేవి, తెట్టెమడుగు

భారీ వర్షం.. రైతుల ఆందోళన

మణుగూరు టౌన్/చర్ల/పాల్వంచరూరల్/గుండాల/అశ్వాపురం/టేకులపల్లి/ఇల్లెందు: జిల్లాలోని పలు చోట్ల గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి వస్తున్న గాలి దుమారానికి తోడు రాత్రి వర్షం పడింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. మణుగూరు, చర్ల, పాల్వంచ, గుండాల, ఆళ్లపల్లి, అశ్వాపురం, టేకులపల్లి, ఇల్లెందు మండలాల్లో వర్షం కురిసింది. దీంతో పంటలను కాపాడుకునేందుకు ఉరుకులు, పరుగులు పెట్టారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మిర్చి రాశులపై టార్పాలిన్ పట్టాలు కప్పుకుని పంటలను కాపాడుకున్నారు. అయినా కొన్ని చోట్ల ధాన్యం, మిర్చి స్వల్పంగా తడిసింది. చేతికి అందిన మొక్క జొన్న చేన్లు పడిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వరద నీటితో టేకులపల్లి ప్రధాన రహదారి సెంటర్ చెరువులా మారింది. పలు దుకాణాల్లోకి వరద నీరు చేరింది. మణుగూరులో రోడ్లు జలమయంగా మారాయి. సింగరేణిలో సెకండ్, నైట్ షిఫ్ట్‌ల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని అధికార వర్గాలు తెలిపాయి.



చర్ల: కల్లాల్లోని మిర్చి తడవకుండా టార్పాలిన్లతో కప్పిన రైతులు

భూ తగాదా కేసులో నిందితుడి రిమాండ్

చుంచుపల్లి: భూ తగాదా కేసులో కొన్ని రోజులుగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని చుంచుపల్లి పోలీసులు పట్టుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. చుంచుపల్లి తండాకు చెందిన బానోత్ రాజాపై భూ తగాదా నేపథ్యంలో కేసు నమోదు చేశారు. కేసు విచారణకు అనేక సార్లు కోర్టుకు హాజరు కాకపోవడంతో బుధవారం రాత్రి చుంచుపల్లి పోలీసులు మహబూబాబాద్ జిల్లా కురవిలో ఉన్నట్లు తెలుసుకుని అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య
- వివరాలు వెల్లడించిన మానుకోట ఎస్పీ సుధీర్‌రాంనాథ్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామ శివారు బోరింగ్‌తండా సమీపంలో గత నెల 31వ తేదీన అర్ధరాత్రి హత్యకు గురైన పార్థసారథి కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భార్యే.. తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిందని మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. ఎస్పీ కథనం ప్రకారం.. భద్రాచలంలోని జగదీశ్ కాలనీకి చెందిన తాటి పార్థసారథి, స్వప్న దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వప్నకు తన తల్లిగారి ఇంటి సమీపంలో అద్దెకు ఉండే, ఏపీలోని ఎటపాక మండలం నెల్లిపాకలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సార్లాం వెంకట విద్యాసాగర్‌తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం పార్థసారథికి తెలియడంతో దంపతుల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి.

రూ. 5 లక్షలకు సుపారీ..

పార్థసారథికి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి ఎంజేపీలో హెల్త్ సూపర్‌వైజర్ ఉద్యోగం రాగా గతేడాది ఫిబ్రవరి నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. అయితే వివాహేతర సంబంధానికి భర్త అడ్డు ఉన్నాడని, అతడిని ఎలాగైనా అంతమొందించాలని స్వప్న తన ప్రియుడు వెంకట విద్యాసాగర్‌కు చెప్పింది. దీంతో అతడు కొత్తగూడేనికి చెందిన తెలుగూరి వినయ్‌కుమార్, శివశంకర్, ఎటపాక మండలానికి చెందిన వంశీతో మాట్లాడి హత్య చేయించాలని పథకం రచించాడు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులకు రూ.5 లక్షలకు సుపారీ ఇచ్చాడు.

సెలవులకు వచ్చి వెళ్తుండగా..

ఉగాది, రంజాన్ సెలవుల కోసం పార్థసారథి భద్రాచలం వచ్చి, మార్చి 31న సాయంత్రం దంతాలపల్లికి వెళ్లే క్రమంలో కొత్తగూడెంలో దంపతులు షాపింగ్ చేశారు. అనంతరం పార్థసారథి తన బైక్‌పై బయలుదేరాక స్వప్న తన ప్రియుడికి సమాచారం అందించింది. దీంతో సుపారీ గ్యాంగ్ ఓ కారును అద్దెకు తీసుకుని పార్థసారథిని వెంబడిస్తూ బోరింగ్‌తండా సమీపంలో అడ్డగించి దారుణంగా హత్య చేశారు. ఈ కేసులో స్వప్న, వెంకట విద్యాసాగర్‌లను అరెస్ట్ చేయగా వినయ్‌కుమార్, శివశంకర్, వంశీ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఏడాది క్రితం పార్థసారథిపై దాడి జరిగిన ఘటనలో రెక్కీ నిర్వహించినట్లు కూసం లవరాజు అనే వ్యక్తిని గుర్తించగా అతడు కూడా పరారీలో ఉన్నారన్నారు. కాగా, కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు సర్వయ్య, సూర్యప్రకాశ్, హథీరాం,నరేందర్, రవికుమార్, ఎస్సైలు దీపిక, మురళీధర్, సతీశ్, ఐటీకోర్ పీసీ సుమన్, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందం సభ్యులను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

ట్రాక్టర్ బోల్తా: ముగ్గురికి తీవ్ర గాయాలు

అశ్వారావుపేటరూరల్: ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ముగ్గురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన రామభక్తులు కాలినడకన గురువారం భద్రాచలం రామాలయానికి వెళ్తున్నారు. కాగా, వీరిలో 10 మంది భక్తులు వారితోపాటే వస్తున్న ట్రాక్టర్ ఎక్కారు. ఈ క్రమంలో అశ్వారావుపేట మండలం ఆసుపాక-నందిపాడు అటవీ ప్రాంతంలోని ముత్యాలమ్మ ఆలయం దాటిన తర్వాత సడన్ బ్రేక్ వేయడంతో ఒక్కసారిగా అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన పాలకుర్తి భవాని, కూచిపూడి మంజు, కొండపల్లి శ్రీనివాసరావులకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి 108 వాహనాల్లో తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, జంగారెడ్డిగూడెం ఆస్పత్రులకు తీసుకెళ్లారు.

ఆక్రమణల పరిశీలన

అడవిని ఖాళీ చేయాలని ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేట: ఆక్రమణకు గురైన అటవీ భూమిని గురువారం అధికారులు పరిశీలించారు. మండలంలోని వినాయకపురం వద్ద అడవిని ఆక్రమించి సాగు చేస్తున్న విషయమై 'అటవీ భూమి ఆక్రమణ?' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అటవీశాఖ అధికారులు స్పందించారు. దమ్మపేట అటవీ రేంజ్ అధికారి కరుణాకరాచారి సిబ్బందితో కలిసి అటవీ సరిహద్దులను పరిశీలించారు. సుమారు ఐదెకరాల మేర అడవి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఖాళీ చేయాలని ఆక్రమణదారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ఎవరూ ఆక్రమణకు పాల్పడకుండా ఫెన్సింగ్ వేస్తామని, ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కాగా ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అటవీ సరిహద్దు పొడవునా చాలా చోట్ల ఆక్రమణలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వే నిర్వహించి అడవిని కాపాడాలని కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ కరుణాకరాచారి

శిథిల ఇళ్లకు నోటీసులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో శిథిలావస్థలో ఉన్న 23 ఇళ్ల యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. భద్రాచలంలో పోకల వీధిలో నివాసం ఉండే శ్రీపతి శ్రీనివాస్ అనే వ్యక్తి తన పాత ఇంటిపై మరో ఐదంతస్తులు నిర్మాణం చేపట్టి, పనులు పూర్తి చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బిల్డింగ్ పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఈ క్రమంలో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. శిథిలావస్థలో ఉన్న 23 ఇళ్లను గుర్తించి, సంబంధిత యజమానులకు నోటీసులిచ్చారు. ఏజెన్సీ ప్రాంతం భద్రాచలంలో అనధికారికంగా (జీ+3)గా నిర్మించిన 131 ఇళ్లను గుర్తించారు. వారిలో 20 మంది ఇంటి యజమానులకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు అందించారు.



ఇళ్ల యజమానులకు నోటీసులు అందజేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

'కాలుష్య' అనుమతులు రాగానే ఉత్పత్తి ప్రారంభం

సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే–7 ఓసీకి ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ వచ్చిందని, ప్రస్తుతం కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతుల ప్రక్రియ సాగుతోందని సింగరేణి ఏరియా జీఎం ఎం.శాలెంరాజు తెలిపారు. అవి వచ్చిన మూడు మాసాల్లో వీకే–7 ఓసీలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనుమతులు రాగానే మట్టి పనులు ప్రారంభించి వీలైనంత త్వరలోనే ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఓసీకి సంస్థ నిర్దేశించిన 10 లక్షల టన్నుల లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. కొత్తగూడెం ఏరియాకు గత ఆర్థిక సంవత్సరంలో వీకే–7ఓసీ మినహాయించి ఏరియాలో 143.50 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా 144.18 లక్షల టన్నుల బొగ్గు వెలికితీశామని వివరించారు. అధికారులు శ్రీరమేష్, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏరియా జీఎం శాలెంరాజు

9 నుంచి ఎస్‌ఏ–2 పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల9 నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఏ–2 పరీక్షలు జరుగుతాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు 17వ తేదీన ముగుస్తాయని, విద్యార్థుల మార్కులు, హాజరు వివరాలను ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని, 23న తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఫలితాలు వెల్లడించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

చంద్రుగొండ : ముగ్గురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ గురువారం రాత్రి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండలంలోని బాలికుంటకు చెందిన బోడ సునీతకు సుజాతనగర్ మండలం రూప్లాతండాకు చెందిన మాన్‌సింగ్‌తో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులకు ఇద్దరు కూతుళ్లు. కాగా ఇటీవల భర్త మాన్‌సింగ్‌తోపాటు అత్త,మామలు బోడా తులసి, సామ్యులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కదల్లేక.. కాలిపోయి

మంటల్లో వ్యక్తి సజీవ దహనం

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : మండలంలోని ఎర్రగుంట గ్రామశివారు తాలుక్‌దార్‌బంజర్‌లో బుధవారం అర్ధరాత్రి విద్యుదాఘాతానికి రెండిళ్లు దగ్ధమయ్యాయి. మంటల్లో చిక్కుకుని ఓ వ్యక్తి సజీవదహనమయ్యాడు. గ్రామానికి చెందిన ఎస్కే గౌస్‌పాష ఇంట్లోని విద్యుత్ స్విచ్‌బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి మంటల చెలరేగాయి. గాఢనిద్రలో ఉన్న అందరూ లేచేసరికి మంటలు ఇల్లంతా వ్యాపించాయి. కుటుంబీకులు కేకలు వేసుకుంటూ బయటకు పరుగెత్తారు. కానీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గౌస్‌పాష (35) మంటల్లో చిక్కుకున్నాడు. అగ్ని కీలలు ఇల్లంతా వ్యాపించడంతో అతన్ని బయటకు తీసుకొచ్చే సాహసం ఎవరూ చేయలేకపోయారు. అతడి ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. మృతుడికి భార్య హసీనా, ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు. కాగా మంటలు పక్కనే ఉన్న తాపీమేస్త్రీ యాకుబ్ ఇంటికి వ్యాపించాయి. చూస్తుండగానే రెండు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. గౌస్‌పాష ఇంట్లో రూ. 30 వేలు నగదు, ఇద్దరి ఇళ్లలో సామగ్రి అగ్నికి ఆహుతైంది. అర్ధరాత్రి వేళ ప్రమాదం చోటుచేసుకోవడంతో మంటలు ఆర్పే పరిస్థితి లేకపోయింది. స్థానికుల సమాచారంతో కొత్తగూడెం నుంచి వచ్చిన ఫైరింజన్ ఇతర ఇళ్లకు నష్టం జరగకుండా మంటలను అదుపుచేసింది. ఈ ప్రమాదంలో రూ. 5 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.





బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ (ఇన్‌సెట్) గౌస్‌పాష (ఫైల్)

ఎమ్మెల్యే జారే పరామర్శ

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఆర్‌ఐ మధు సంఘటనా స్థలాన్ని సందర్శించి నష్టం అంచనా వేశారు. తక్షణ సహాయం కింద బాధిత కుటుంబాలకు చెరో రూ. 5 వేలు నగదు, 30 కేజీల బియ్యం అందించారు.

మహిళపై అత్యాచార యత్నం

మణుగూరు టౌన్: అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై బుధవారం రాత్రి కేసు నమోదుకాగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ సోమ సతీష్ కథనం ప్రకారం.. మండలంలోని తిర్లాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ బుధవారం మధ్యాహ్నం పొలం పనులు చేసుకుని ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో వెంకన్న అనే వ్యక్తి ఆమెపై అత్యాచారయత్నం చేయబోయాడు. ప్రతిఘటించిన ఆమె వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నా కుమారుడి నిర్లక్ష్యమే కారణం

కేసు పెట్టిన తండ్రి.. నిందితుడికి ఏడు నెలల జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: ఆటోను నిర్లక్ష్యంగా నడిపి తల్లి మృతికి కారణమైన కుమారుడికి 7 నెలల జైలు శిక్ష విధిస్తూ గురువారం కొత్తగూడెం రెండో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కే. సాయిశ్రీ తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2017, జూలై 4న తిరువూరుకు చెందిన దంపతులు బిస్తూ లాల్ బహదూర్, రమాదేవి తమ కుమారుడు ధన్ బహదూర్ ఆటోలో వ్యవసాయ భూముల ముంపు పరిహారం తీసుకునేందుకు కుక్కునూరుకు బయలుదేరారు. వారితోపాటు వీఎంబంజర్‌కు చెందిన పెద్దమ్మ పనగాల జయమ్మ కూడా వెళ్లారు. తిరిగి రాత్రి 9 గంటల సమయంలో వస్తుండగా కట్టుగూడెం మూలమలుపు వద్ద ఆటో నిర్లక్ష్యంగా నడుపుతూ డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో రమాదేవి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ ధన్ బహదూర్, పనగాల జయమ్మలకు కూడా తీవ్రగాయాలయ్యాయి. కాగా లాల్ బహదూర్ తన కుమారుడు ధన్ బహదూర్‌పై ఫిర్యాదు చేయగా, అన్నపురెడ్డిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టులో 11 మంది సాక్షులను విచారించిన అనంతరం బిస్తూ ధన్ బహదూర్‌పై నేరం రుజువు కావడంతో జడ్జి ఏడు నెలల జైలు శిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున విశ్వశాంతి వాదించారు. కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్‌కే అబ్దుల్ ఘని సహకరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ శ్రీ గోల్డ్ బైయర్స్ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9010190666 [SCA25002404]

Wanted

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [SCA25002557]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.